క్లుప్తంగా

వాచ్‌మెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో డే వాచ్‌మెన్ (మహిళ) పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ మేక నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన మహిళ అయి ఉండి 2023 జూన్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండి 10వ తరగతి ఉత్తీర్ణురాలై ఉండాలన్నారు. ఈ నెల 27 నుంచి 28వ తేదీ వరకు కస్తూరిబా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

జియాలజీలో డాక్టరేట్



చేకూరి పరమేష్

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన చేకూరి పరమేష్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం శుక్రవారం డాక్టరేట్ ప్రకటించింది. జియాలజీ డిపార్ట్‌మెంట్‌లో గ్రౌండ్ వాటర్‌పై ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన పరిశోధనకుగాను పరమేష్ డాక్టరేట్ పట్టా పొందాడు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ డాక్టరేట్‌ను తన తండ్రి భిక్షమయ్యకు అంకితమిస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టరేట్ పొందిన పరమేష్‌ను ఎంఎస్‌ఎఫ్ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి చేకూరి గణేశ్ మాదిగ, మల్లేష్, నరేష్‌లు అభినందించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

మర్రిగూడ : మండల పరిధిలోని లెంకలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న జాన్‌పాడ్ బాబాసైదులు చందనోత్సవం ఉర్సులో శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చల్లమల్ల కృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహాగౌడ్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు సిరిపంగి శ్రీనివాస్, పగిళ్ల దేవదాస్, కృష్ణయ్య, యాదయ్య, ఇబ్రాయిల్, గోపి, దర్గా స్వామి నాగార్జున, అంజయ్య పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

నకిరేకల్ : జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో నకిరేకల్ నియోజకవర్గంలోని యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య కోరారు. నకిరేకల్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెల్ నంబర్ 7661899899కు ఫోన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా అందించాలి

చండూరు(గట్టుప్పల) : భారత రాజ్యాంగ గ్రంథాన్ని పౌరులందరికీ ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గిరి మహరాజ్ అన్నారు. శుక్రవారం గట్టుప్పల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ సభ్యుడు లింగయ్య, మారయ్య, మహేష్, కొండల్, సురేష్, శివ యాదవ్, సాయి, జగన్, మధు, గిరి, వెంకటేష్, కిరణ్, గణేశ్, యాదగిరి, శ్రీధర్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



శంకుస్థాపన చేస్తున్న దూదిమెట్ల బాలరాజు యాదవ్

నకిరేకల్ : గ్రంథాలయాలను యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డా.దూదిమెట్ల బాలరాజుయాదవ్, డా. బెల్లి యాదయ్య అన్నారు. మండలంలోని పాలెం గ్రామంలో రాజ్యసభ సభ్యుడు డా. కేశవరావు నిధులు రూ.10 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శుక్రవారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏకుల కవిత విజయ్, ప్రద్యుమ్నాచారి, తాటిచెట్టు శ్రీనివాస్, చొగోని యాదగిరి, నోముల కేశవరాజు, బొంకూరి భిక్షం, నోముల మనోహర్, ఎం స్వామి, ఎన్. వెంకటయ్య, మల్లారెడ్డి, లింగయ్య, యాదగిరి, కిరణ్, రాములు, మల్లేష్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ర్యాలీని జయప్రదం చేయండి

నల్లగొండ టౌన్ : జూన్ 4వ తేదీన హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పైన ఉన్న శ్రీ మహాత్మా బసవేశ్వరుడి విగ్రహం వరకు నిర్వహించే ర్యాలీలో జిల్లా నుంచి లింగాయత్ బలిజ సంఘం నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సంఘం భవనంలో ర్యాలీ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సెంట్రల్ సమన్వయ సమితి చైర్మన్ జి.అవినాష్, వీరశైవ లింగాయత్ బలిజ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, చెంగివప్ప, మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు పొగాకు నాగరాజు, శాంతికుమార్, పరమేష్, ఈశ్వరయ్య, శేఖర్, వరప్రసాద్, శ్రవన్, వీరప్ప, శ్రీశైలం, లింగయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతుల నిరీక్షణ !

- 40 రోజుల్లో 1.40 లక్షల క్వింటాళ్లు కొనుగోలు
- కేంద్రాల్లో నేటికీ 70 వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు
- దిగుమతులకు నోచుకోక మిల్లుల వద్ద లారీల పడిగాపులు



వల్లాలలో రైస్‌మిల్లు వద్ద బారులుదీరిన ధాన్యం లోడు లారీలు, ట్రాక్టర్లు



చిత్తలూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం రాశులు

శాలిగౌరారం : ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో 40 రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. కొనుగోళ్లు వేగంగా జరిగేలా అధికారులు, కేంద్రాల నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నా.. మిల్లర్ల పేచీలు, లారీల కొరత, దిగుమతుల్లో హమాలీ సమస్య రైతులను వేధిస్తున్నాయి. శాలిగౌరారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోయింది.

13 కేంద్రాలకు 15 లారీలు..

శాలిగౌరారం మండలంలో యాసంగి వరిధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం 13 కేంద్రాలను గత నెల 16న ప్రారంభించింది. వాటిలో ఐకేపీ ఆధ్వర్యంలో 7, పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాలుగు, ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో రెండు కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటివరకు ఆయా కేంద్రాల ద్వారా 1.40 లక్షల క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. నేటికి మరో 70 వేల క్వింటాళ్ల ధాన్యం రాశులు నిల్వ ఉన్నాయి. లారీల సమస్య అధికంగా ఉండడంతో మండలానికి రోజుకు సగటున 15 లారీలు వస్తున్నాయి. రైస్‌మిల్లుల వద్ద దిగుమతులు కాకపోవడంతో రోజుల తరబడి లారీలు వేచి ఉండడంతో సమస్య ఏర్పడుతోంది. నకిరేకల్ పరిధిలో ధాన్యం రవాణాకు లారీల విషయంలో రెండు బ్లాక్‌లు ఏర్పాటు చేశారు. అందులో నకిరేకల్, కేతేపల్లి ఒక బ్లాక్‌గానూ, శాలిగౌరారం, కట్టంగూరు మరో బ్లాక్‌గానూ ఏర్పాటు చేశారు. రెండు బ్లాక్‌లలో కలిపి 150 లారీలు ఉన్నాయి. ప్రస్తుతం రైస్‌మిల్లుల వద్ద నాలుగు రోజులుగా 80 లారీలు దిగుమతుల కోసం వేచి ఉన్నాయి. రొటేషన్ పద్ధతిలో 70 లారీలు మాత్రమే నాలుగు మండలాల్లోని కేంద్రాల ద్వారా ధాన్యం రవాణా చేస్తున్నాయి.

మిల్లర్ల పేచీలు

ధాన్యం నాణ్యతగా ఉన్నప్పటికీ రైస్‌మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకోకుండా పేచీలు పెడుతున్నారు. దీంతో రోజుల తరబడి దిగుమతులు జరగకపోవడంతో లారీలు సకాలంలో రావడం లేదు. రైతుల ఇబ్బందులను ఆసరాగా చేసుకున్న మిల్లర్లు క్వింటాలుకు అదనంగా 15 కిలోల ధాన్యం కోత విధిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు, ఎగుమతులు వేగవంతం చేసి తాము నష్టపోకుండా చూడాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

రెండుమార్లు ధాన్యం తడిసింది



“ చిత్తలూరులో ఐకేపీ కేంద్రానికి ధాన్యం తరలించి నెల రోజులు కావొస్తుంది. ఒకరోజు కాంటాలు జరిగితే రెండు రోజులు నిలిపివేస్తున్నారు. లారీలు రాకపోవడంతో కాంటాలు కావడంలేదు. ఇప్పటికే అకాల వర్షాలకు రెండుమార్లు ధాన్యం తడిసిపోయింది. రోజులు గడుస్తున్నాయే తప్ప కొనుగోలు మాత్రం జరగడంలేదు. లారీల సమస్య తీర్చి ధాన్యం కొనుగోళ్లు, ఎగుమతులు వేగవంతం చేయాలి.

– గిరగాని జయప్రకాశ్, రైతు, చిత్తలూరు

దిగుమతులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం



“ మిల్లుల వద్దకు వెళ్లి దిగుమతులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. లారీల కొరత వల్ల ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేయలేకపోతున్నాం. ట్రాక్టర్లను కూడా రవాణాకు వినియోగించుకోవాలని రైతులకు తెలియజేశాం. మిల్లుల వద్ద ధాన్యం దిగుమతులు వేగంగా కాకపోవడంతో రైతులు ట్రాక్టర్లను వినియోగించేందుకు వెనుకాడుతున్నారు.

– శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్, శాలిగౌరారం

తాగునీటి సమస్య లేకుండా చేస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీ శివారు కాలనీల్లో తాగు నీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 8,9వ వార్డుల్లో ఆయన పర్యటించారు. బోర్ వెల్, పైప్‌లైన్ సమస్య ఉందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బోర్‌వెల్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. అమృత్ 2.0 లో అన్ని విలీన గ్రామాలకు పూర్తి స్థాయి నీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పిల్లి రామరాజు యాదవ్, మున్సిపల్ ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, డీఈ వెంకన్న, ఏఈలు దిలీప్, రవీందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

రివర్ నిమ్స్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ

నల్లగొండ టౌన్ : నల్లగొండ మండలం మేళ్ల దుప్పలపల్లికి చెందిన వి.శంకరయ్యకు ఓపెన్ హార్ట్ సర్జరీని విజయవంతంగా పూర్తిచేశామని రివర్ నిమ్స్ కార్డియాలజిస్టు డాక్టర్ పవన్‌తేజ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సంవత్సరాలుగా సుమారు ఐదు వందల మందికి స్టంట్‌లు వేసి ప్రాణాలు కాపాడామన్నారు. ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీతోపాటు మరొక రోగికి పీటీసీ స్టంట్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేశామన్నారు. న్యూరాలజీ, నెఫ్రాలజీ, జనరల్ మెడిసిన్ వంటి స్పెషలైజేషన్ వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. జూన్ మొదటి నుంచి ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ సేవల ద్వారా ఓపెన్‌హార్ట్ సర్జరీలు, పీటీసీ స్టంట్ వైద్య సేవలను నిరుపేదలకు ఉచితంగా అందించనున్నామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రఘునందన్, డాక్టర్ రాజేష్‌రెడ్డి, డాక్టర్ సుధ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పవన్‌తేజ

ముమ్మరంగా ధాన్యం తరలింపు



ఊకొండి కేంద్రంలో ధాన్యం లోడ్ చేస్తున్న హమాలీలు

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గత గురువారం ధాన్యం తరలింపునకు లారీల కొరత అనే శీర్షికతోపాటు ఇతర కథనాలను వరుసగా సాక్షిలో ప్రచురించడంతో అధికారులు స్పందించారు. స్థానిక మిల్లుల వద్దకు వెళ్లి లారీలలో ఉన్న ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేయించి కొనుగోలు కేంద్రాలకు పంపిస్తున్నారు. మరో మూడు, నాలుగు రోజుల్లో ధాన్యం పూర్తిగా రవాణా చేయించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.కృష్ణారెడ్డి తెలిపారు.

'అప్పుల రాష్ట్రంగా మార్చిన బీఆర్ఎస్'

నకిరేకల్ : తెలంగాణను బీఆర్ఎస్ పార్టీ అప్పులు రాష్ట్రంగా మార్చి దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందని టీ పీసీసీ నేత దైద రవీందర్ విమర్శించారు. నకిరేకల్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పగిస్తే రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ద కాలంలో 5లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను.. సబ్సిడీ ఎత్తివేసి రైతు బంధు పేరుతో రైతులను మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య, దైద స్వప్న, నాయకులు బొబ్బిలి నర్సింహారెడ్డి, నామిరెడ్డి కృష్ణారెడ్డి, యూసుఫ్, అబ్దుల్ మజీద్, రాజశేఖర్, మహేష్, సతీష్, నక్షత్, సైదులు, పసుపతి, సాయి, ప్రభు, మధు తదితరులు ఉన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



సర్టిఫికెట్ అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

చిట్యాల : యువతులు, బాలికలు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలని చిట్యాల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పెద్దకాపర్తి గ్రామంలో యువ సంఘర్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాణి రుద్రమదేవి సాధన క్యాంపు ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా క్యాంపులో పాల్గొన్న బాలికలకు సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి, యువ సంఘర్షణ ఫౌండేషన్ చైర్మన్ అనుమోజు రామాచారి, గురువులు ఉమేష్ త్రివేది, శివ ఆచార్యజీ, పర్వతం నరేందర్, వెంకటేశ్వర్లు, కాటం సందీప్, బత్తుల శివాగౌడ్, తేజ పాల్గొన్నారు.

కాంటా వేసినందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్

కనగల్ : దర్వేశిపురం ఐకేపీ కేంద్రానికి చెందిన నిర్వాహకురాలి భర్త నరాల వెంకన్న ధాన్యం కాంటా వేసినందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని ఇదే గ్రామపంచాయతీ పరిధికి చెందిన రైతు బోదనపు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై ఏపీఎం నరహరిని వివరణ కోరగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

- రేపటి నుంచి జూన్ 1వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- దినదినాభివృద్ధి చెందుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం



దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం



శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారు

కనగల్ : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతోంది దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్ల మ్మ అమ్మవారి ఆలయం. ఈ నెల 28నుంచి జూన్ 1వరకు శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతుండడంతో ఆలయాన్ని సకల హంగులతో ముస్తాబు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఉత్సవాలకు భక్తులు హాజరుకానున్నారు.

30న రేణుక అమ్మవారి కల్యాణం

దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ అమ్మవారి దేవస్థానం నల్లగొండ జిల్లా కేంద్రానికి 11కిలో మీటర్ల దూరంలో వెలిసింది. అన్ని మతాల వారు అమ్మవారిని దర్శించుకుని వేపచెట్టుకు ముడుపు కట్టి మొక్కులు చెల్లించుకుంటారు. రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 28న నిత్యపూజాలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభిస్తారు. 29న ఎదుర్కోళ్ల మహోత్సవం, 30న శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు బ్రహ్మశ్రీ దేరం భాస్కర శర్మ, నాగోజు మల్లాచారి, శ్రవణాచారిల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నారు. 31న 108 కలశములతో అష్టోత్తర శతఘటాభిషేకం, సాయంత్రం బోనాలు, జూన్ 1న అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



“ దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఆలయం వద్ద లైటింగ్, చలువ పందిళ్లు, మంచి నీటి వసతి వంటి సౌకర్యాలు కల్పిస్తున్నాం. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి.

– జల్లేపల్లి జయరామయ్య, ఆలయ ఈఓ

దాతలు, భక్తుల సహకారంతో అభివృద్ధి



“ శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారు భక్తుల పాలిట కొంగుబంగారంగా ప్రాచుర్యం పొందింది. ఈ ఆలయం నల్లగొండ–దేవరకొండ ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఆలయం భక్తులు, దాతల సహకారంతో మరింత అభివృద్ధి చెందింది.

– నాగోజు మల్లాచారి, ఆలయ ప్రధాన అర్చకుడు

జాతరను పకడ్బందీగా నిర్వహించాలి



చిట్యాల : అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ ఆదిపరాశక్తి లక్ష్మీదేవమ్మ జాతరను పకడ్బందీగా నిర్వహించాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. నార్కట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లకోమారు నిర్వహించే ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ శివరాంరెడ్డి, ఎంపీఓ పద్మ, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, సర్పంచ్ రత్నం పుష్ప తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు శుక్రవారం నార్కట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ మేడి నర్సింహ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పర్రె యాదయ్య, గుడుగుంట్ల మల్లికార్జున్, మధు, బర్రె సంజీవ, బోనగిరి నవీన్, పర్రె శ్రీనులతో పాటు మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడి లింగమ్మ నర్సింహ, ఎంపీటీసీ ఏళ్ల ప్రభావతి సత్యనారాయణరెడ్డి, కర్నాటి ఉప్పల్‌రెడ్డి, మేడి ఉపేందర్ పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురండి

నార్కట్‌పల్లి : సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తన దృష్టి తీసుకురావాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా..? గ్రామాల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయి..? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల కోసం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం అమలు చేస్తున్నారని వాటిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట సర్పంచ్ గోలుసు భద్రాచలం, ఉప సర్పంచ్ యాట సైదులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చ ముత్యాలు, వార్డు సభ్యులు మచ్చ నరేష్, సుదర్శన్ తదితరులున్నారు.

బస్టాండే ఇల్లు.. పొరుగువారు అందిస్తేనే ఆహారం



రాంరెడ్డిపల్లి బస్టాండ్‌లో నివసిస్తున్న మహిళ

మర్రిగూడ : మతిస్థిమితం లేని దాదాపు 50 ఏళ్ల మహిళ 30 రోజులుగా రాంరెడ్డిపల్లి బస్టాండ్‌లో నివాసం ఉంటూ ఇరుగు పొరుగు వారు అందించే ఆహారాన్ని తీసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. వివరాలు.. ఓ మహిళ 30 రోజులుగా మండలంలోని రాంరెడ్డిపల్లి వీధుల్లో తిరుగుతూ బస్టాండ్ వద్ద నివాసం ఉంటోంది. ఇరుగుపొరుగు వారు అందించే ఆహారం తింటూ జీవిస్తోంది. రహదారి వెంట ఉన్న చిత్తు పేపర్లు, ఖాళీ సీసాలు వంటి పలు వస్తువులను పోగు చేసుకుంటోంది. ఎవరైనా మాట్లాడితే ఎదుటి వారితో సాధారణంగా మాట్లాడుతున్నప్పటికీ తన పేరు, ఊరి పేరు చెప్పడం లేదు. కుటుంబ సభ్యుల వద్దకు కానీ, ఏదేని శరణాలయానికి తరలిస్తే ఆమె బాగోగులు వారే చూసుకుంటారని స్థానికులు పేర్కొంటున్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

నకిరేకల్ : లయన్స్ క్లబ్ సెంటీనియల్ ట్రెజరర్ కందాల వెంకట్‌రెడ్డి సతీమణి వర్ధంతి సందర్భంగా నకిరేకల్‌లోని కందాల కాంప్లెక్స్‌లో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మారిడి చంద్రశేఖర్ శెట్టి, ప్రధాన కార్యదర్శి వంటిపాక సోమేష్, సూదిరెడ్డి బాబురెడ్డి, యానాల రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

పాలీసెట్‌లో 21వ ర్యాంక్



మద్దోజు మనీష్

నల్లగొండ : పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన మద్దోజు మనీష్ పాలీసెట్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో స్టేట్ 21వ ర్యాంకు సాధించాడు. మనీష్ తండ్రి మద్దోజు శ్రీనివాసచారి ప్రైవేటు టీచర్ కాగా, తల్లి విజయలక్ష్మీ నల్లగొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. మనీష్ పట్టణంలోని ఎస్ఎస్ స్కూల్ ఆఫ్ లెర్నింగ్ పాఠశాలలో 4 నుంచి 10వ తరగతి వరకు చదివాడు. పదో తరగతి ఫలితాల్లో 10 జీపీ సాధించాడు.

హమాలీల సంఖ్య పెంచాలి



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

రామగిరి(నల్లగొండ): హమాలీల సంఖ్య పెంచి ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం తిప్పర్తి మార్కెట్ యార్డులో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రెండు రోజుల్లో కొనుగోళ్లను పూర్తి చేయాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ బి. శ్రీకాంత్, బచ్చలకూరి నరహరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

మోదీ 'పార్లమెంట్' ను ప్రారంభించడం సరికాదు

రామగిరి(నల్లగొండ): నూతన పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి, స్పీకర్‌తో కాకుండా ప్రధాని మోదీ ప్రారంభించడం సరికాదని, దాని వెనుక బీజేపీ రహస్య ఎజెండా ఉన్నట్లు మేధావులు, రాజకీయ పార్టీలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పాశం నరేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత్, వార్డు మెంబర్ సోమరాజు, సైదులు, వెంకన్న, సురేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

మర్రిగూడ : విత్తన, ఎరువుల దుకాణాదారులు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ఆవుల స్పందన అన్నారు. శుక్రవారం మండలంలోని రాంరెడ్డిపల్లి, శివన్నగూడ గ్రామాల్లోని పలు విత్తన దుకాణాలను స్థానిక ఎస్ఐ కె.రంగారెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు రశీదును భద్రపరుచుకోవాలని సూచించారు. ఎవరైనా కల్తీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

గొడుగుల పంపిణీ



గొడుగులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : అభయ ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ ఎలైట్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ పట్టణంలోని వీధి వ్యాపారులకు ఉచితంగా గొడుగులు అందజేశారు. ఎండలు, వర్షాల నుంచి రక్షణ పొందడానికి వీధి వ్యాపారులకు రూ.3 వేల విలువ చేసే గొడుగులను అందిస్తున్నామని లయన్స్‌క్లబ్ ఎలైట్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీ ప్రసాద్, రవికుమార్, అమరేందర్, సురేందర్, కొండల్, భానుప్రసాద్ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు ఉపయోగించండి

నార్కట్‌పల్లి : ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి చేనేత వస్త్రాలను ఉపయోగించుకోవాలని జీవ వైవిధ్య జిల్లా కమిటీ సభ్యుడు, జీవ వైవిధ్య పరిరక్షణ అవార్డు గ్రహీత సురేష్ గుప్తా అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండల సమాఖ్య కార్యాలయంలో 'జీవ వైవిధ్యం–పర్యావరణ పరిరక్షణ'అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతోపాటు యోగా సాధన చేయాలని, నవ ధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన కూరగాయలను తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి గౌడ్, డీపీఎం బెనర్జీ, మోహన్‌రెడ్డి, ఏపీఎం దూదిమెట్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

మర్రిగూడ : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మర్రిగూడ మండల కేంద్రంలో వీఓఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 40వ రోజుకు చేరుకుంది. రంగినేని చంద్రకళ, గంటా మంజుల, పద్మ, మలిగిరెడ్డి శోభ, జ్యోతి, కడారి యాదమ్మ, విజయ, శాంతి, సరిత పాల్గొన్నారు.

ఇంజనీర్ కావాలనేదే ధ్యేయం



కారింగు రేణుక పాలీసెట్ 164 వ ర్యాంకు

చండూరు మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన కారింగు రేణుక పాలీసెట్ (హాల్ టికెట్ నంబర్ 2509108, యంబైపీసీ) లో 164 వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు కారింగు ఓటేష్–సునిత వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నారు. రేణుక ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు మండల కేంద్రంలోని గీతా విద్యాలయంలో చదివింది. భవిష్యత్‌లో ఇంజనీర్ కావాలన్నదే తన ధ్యేయమని రేణుక అంటోంది.

రోబోటిక్స్ సైంటిస్ట్ లక్ష్యం



కోమల్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

చండూరు మండలం తిమ్మారెడ్డిగూడెంకు చెందిన చింతరెడ్డి కోమల్‌రెడ్డి పాలీసెట్ లో 122 ర్యాంకు సాధించాడు. తండ్రి చింతరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి మంగ గృహిణి. వీరు మిర్యాలగూడలో నివాసం ఉంటున్నారు. కోమల్‌రెడ్డి ఒకటి నుంచి 3 వరకు సూర్యాపేట నవోదయ పాఠశాలలో 4, 5 కేంద్రీయ విద్యాలయం, 6 నుంచి 10వ తరగతి వరకు మిర్యాలగూడలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యనభ్యసించాడు. భవిష్యత్‌లో రోబోటిక్స్ సైంటిస్ట్ కావాలనేదే తన లక్ష్యమని కోమల్‌రెడ్డి తెలిపాడు.